క్లుప్తంగా

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



సాలూరు పట్టణంలోని కామాక్షమ్మ ఆలయంలో వల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

సాలూరు: పట్టణం, మండలాల్లోని పలు ఆలయాల్లో సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాలూరు పట్టణంలోని కామాక్షమ్మ ఆలయంలో, పాచిపెంట మండలం చీపురువలస సమీపంలోని పారమ్మకొండ మీద వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పారమ్మకొండ వద్ద అన్నదానం నిర్వహించారు.

పాఠశాలలకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లను ప్రధానోపాధ్యా యులకు అందించిన ఎంఈఓలు సామల సింహాచలం, కె.శ్రీనివాసరావులు

బలిజిపేట: మండలంలోని ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీకి సిద్ధం చేశారు. అందులో భాగంగా ఎంఆర్సీకి చేరిన ట్యాబ్‌లను ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓలు సామల సింహాచల, కె.శ్రీనివాసరావులు సోమవారం అందించారు. ఈ నెల 21వ తేదీన పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారని ఎంఈఓ సామల సింహాచలం తెలిపారు. మండలంలో 10ఉన్నత పాఠశాలలకు 441ట్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కలతో బెంబేలు



నెయ్యిల వీధిలో కుక్కల గుంపు

పార్వతీపురం: పట్టణంలో కుక్కల సంచారంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. అవి మూకమ్మడిగా తిరుగుతూ ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తాయో తెలియక రాకపోకలు చేసేందుకు భీతిల్లుతున్నారు. కుక్కలను నియంత్రించేందుకు అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో రోజురోజుకు వాటి సంతతి పెరిగిపోయి ప్రజలపై తరచూ దాడులు చేస్తున్నాయి. పార్వతీపురం పట్టణంలోని నెయ్యిలవీధిలో కుక్కలు గుంపుగా తిరుగుతున్నాయి. ఈమార్గంలో ద్విచక్రవాహనాలపై, కాలినడక ప్రయాణం చేసేందుకు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల బారినుంచి రక్షించాలని కోరుతున్నారు.

భక్తి శ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్ఠి



సామూహిక పూజలు చేస్తున్న మహిళలు

పార్వతీపురంటౌన్: పట్టణంలోని పశుపతినాథ్ బ్రహ్మసూత్ర శివాలయంలో ఆలయ అర్చకుడు పత్రాయిని సురేష్ శర్మ ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్య షష్ఠి పూజలను సోమవారం నిర్వహించారు. వేకువ జామునుంచే మహిళలతో సామూహిక పూజలను చేయించారు. ఏటా సుబ్రహ్మణ్య షష్ఠి రోజున స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని అర్చకుడు తెలిపారు. సాయంత్రం స్వామివారి కల్యాణాన్ని జరిపించగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'హెల్పింగ్ హ్యాండ్స్' సాయం



మహిళకు ఆర్థిక సాయం చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని గడ్డికాలనీకి చెందిన గంటా లక్ష్మి దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతుండడంతో హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు సోమవారం ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం, పండ్లు, నిత్యావసర సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బి.గౌరీశంకరరావు, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు పాలక ప్రేమానంద్, వర్తక సంఘం అధ్యక్షుడు విష్ణుప్రసాద్, వైశ్య సంఘం అధ్యక్షుడు జి.హరిప్రసాద్ తదితరులున్నారు.

ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



పెదంకలాంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు నాలుగున్నరేళ్లలో ప్రతి కుటుంబానికి వేర్వేరు పథకాల ద్వారా లబ్ధి చేకూర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని పెదంకలాం సచివాలయం పరిధిలో సోమవారం రాత్రి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని సర్పంచ్ బి. శ్రీనివాసరావు, ఎంపీపీ బి.రమణమ్మల ఎమ్మెల్యే అలజంగి జోగారావు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెదంకలాం సచివాలయం పరిధిలో రూ 25,55,23,274లతో సంక్షేమ, అభివృద్ధి పనులు జరిగాయని తెలియజేశారు. సంక్షేమ పథకాలను అందిపుచ్చుకుంటున్న వారంతా 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి చిట్టిరాజు, పలుగ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీలు, పార్టీలో సేవలందిస్తున్న వివిధ కేడర్ల నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సీతానగరంలో ఇంటింటి కుళాయి పనులు



ఇంటింటి కుళాయి పైప్‌లను పరిశీలిస్తున్న పరిశీలిస్తున్న ఏఈ పవన్‌కుమార్

సీతానగరం: జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా కోట్లాది రూపాయల వ్యయంతో నిర్వాహకులు చేపడుతున్న ఇంటింటి కుళాయిల పనులు వేగవంతం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్ పవన్‌కుమార్ కోరారు. ఈ మేరకు సీతానగరం మండల కేంద్రంలో జరుగుతున్న పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల కేంద్రంలోని ప్రతి ఇంటికీ తాగునీరు సరఫరా చేయడానికి వీలుగా ట్యాప్‌లు అమర్చనున్నామని అందుకు అవసరమైన రూ.55 లక్షల నిధులు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఇప్పటికే 50 శాతం పనులు పూర్తయినట్లు తెలియజేశారు. నూతనంగా నీలకంఠాపురంలో రూ.23.5 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్, ఇంటింటి కుళాయి పనులకు ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేయనున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ సహాయకురాలు పార్వతి, పైప్‌లైన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

యువకుల దాడిలో ముగ్గురికి గాయాలు



కురుపాం: చికిత్స పొందుతున్న కామేశ్వరరావు

జియ్యమ్మవలస: మండలంలోని రామినాయుడువలసలో ఆదివారం రాత్రి పెండ్లి వేడుకకు హాజరైన ముగ్గురు యువకులపై గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేసినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కన్నపుదొరవలస గ్రామానికి కిశోర్, క్రాంతి, కాశిలు పెళ్లికి రాగా పార్వతీపురం మండలానికి చెందిన కొంతమంది వారిపై దాడికి పాల్పడ్డారు. గాయపడిన ముగ్గురు యువకులను చినమేరంగి సీహెచ్‌సీకి బంధువులు తరలించి ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురంలోని ఏరియా హాస్పిటల్‌కు పంపించినట్లు చినమేరంగి వైద్యులు తెలిపారు. ఈ విషయంపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

తేనెటీగల దాడిలో గిరిజన రైతుకు అస్వస్థత

కురుపాం: మండలంలోని కిచ్చాడ పంచాయతీ పట్టాయిదొర వలస గ్రామానికి చెందిన గిరిజన రైతు యజ్జు కామేశ్వరరావు (58) తేనెటీగల దాడిలో గాయపడి అస్వస్థతకు గుర్యాడు. సోమవారం ఉదయం పంటపొలం వద్దకు కేమేశ్వరరావు వెళ్తుండగా ఒక్కసారిగా తేనేటీగలు ముఖం, వంటిపై దాడి చేశాయి. గ్రామస్తులు వెంటనే కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

కవులకు సత్కారం



నిర్మల్‌కుమార్‌కు సన్మానిస్తున్న శ్రీశ్రీ కళావేదిక ప్రతినిధులు

గుమ్మలక్ష్మీపురం: తాడేపల్లిలో ఈనెల 16, 17 తేదీల్లో జరిగిన ప్రపంచ కవితోత్సవంలో ఏజెన్సీ కవులైన ఎల్విన్‌పేట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పెద్దింటి నిర్మల్ కుమార్, మండ గ్రామంలోని ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం పాలక దేవానంద్‌లకు శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, సమన్వయకర్త కొల్లి రమావతి తదితరులు మెమొంటో, ధ్రువపత్రాలు అందించి సన్మానించారు. ఈ సందర్భంగా నిర్మల్‌కుమార్, దేవానంద్ సోమవారం గుమ్మలక్ష్మీపురంలో స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రపంచ కవితోత్సవంలో త్రినేత్రం అనే కవితను రచించి చదివి వినిపించడం జరిగిందని, ఆలోచింపజేసే కవితలు రాయడం, జీవం ఉట్టిపడేలా దాన్ని ప్రజెంట్ చేయడంతో వేదిక ప్రతినిధులు తమను సత్కరించినట్లు చెప్పారు.

ఎయిడ్స్‌పై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న సంస్థ సభ్యులు

భామిని: మండలంలోని బిల్లుమడ సచివాలయంలో ఎయిడ్స్, హెచ్ఐవీలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బూస సంతోష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో బత్తిలి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది హెచ్ఐవీ వ్యాప్తి, నివారణ చర్యలను వివరించారు. చైల్డ్ ఫండ్ ఇండియా సారధ్యంలోని లింక్ వర్కర్స్ స్కీమ్ కింద ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. ఎస్ఓ సీహెచ్ ప్రసాద్, సీఎల్‌డబ్ల్యూ శ్రీను, ఏఎన్ఎం ప్రవంతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగులకు ఆర్థిక సాయం

జియ్యమ్మవలస: మండల విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులకు మండలంలోని ఉపాధ్యాయులు ఆర్థిక సాయం అందించారు. సీఆర్పీలు, ఎల్‌డీఏ, ఆఫీస్ సబార్డినేట్‌లకు సుమారు 4 నెలలుగా జీతాలు లేకపోవడంతో వారంతా కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారని భావించి ఉపాధ్యాయులంతా తలో కొంత చొప్పున రూ.70 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని ఎంఈఓలు నాగభూషణరావు, శ్రీనివాసరావు చేతులమీదుగా సోమవారం ఉద్యోగులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు ఉన్నారు.

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు



పాచిపెంట మండల పరిషత్ కార్యాలయంలో సీఎం ప్రసంగాన్ని తిలకిస్తున్న ఎంపీడీఓ లక్ష్మీకాంత్, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు



ముఖ్యమంత్రి ప్రసంగాన్ని తిలకిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, కమిషనర్ జయరామ్, తదితరులు

సాలూరు: ఆరోగ్యశ్రీ పరిధిని రూ. 25 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తాడేపల్లి నుంచి జరిగిన కార్యక్రమాన్ని సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జయరామ్, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

పాచిపెంటలో..

పాచిపెంట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ లక్ష్మీకాంత్, అధికారులు, నాయకులు పాచిపెంట వీరంనాయుడు, మీసాల నారాయణ, పెద్దిబాబు, కొండలరావు, తదితరులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం ప్రసంగాన్ని వీక్షించారు. ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిన ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఎస్పీ మంజూరుకు ఎమ్మెల్యే కృషి అభినందనీయం



బాలేరు వద్ద ఎస్పీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న విశ్రాంత వీసీ సుదర్శనదొర, రొక్కం రామారావు

భామిని: మండలంలోని బాలేరు సమీపంలో వంశధార వరదకాలువ నుంచి సాగునీరు తరలించేందుకు వరదకాలువపై డ్రోణి నిర్మాణానికి ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి చేసిన కృషిని నాగార్జున యూనివర్సిటీ విశ్రాంత వైస్ ఛాన్సలర్ రొక్కం సుదర్శన దొర, నీటి సంఘ మాజీ అధ్యక్షుడు రొక్కం రామారావు కొనియాడారు. బాలేరు వద్ద వంశధార వరదకాలువపై నీటి తరలింపు డ్రోణి నిర్మాణ స్థలంను సోమవారం పరిశీలించారు. గత ఏడేళ్లుగా బాలేరు గెడ్డ సిస్టమ్ నీరును సాగుభూమి చెరువులకు తరలించాలని కోరుతూ ఆయకట్టు రైతులు పోరాడుతున్నారు. వరద కాలువ నిర్మాణంతో గెడ్డ సిస్టమ్ నీరు కొండ అంచుల్లోనే నిలిచిపోయి వందలాది ఎకరాల పంటకు నష్టం కలుగుతున్నాయని వాపోయారు. ఇటీవల కురుపాంలో ముఖ్యమంత్రి జగన్‌ను ఎమ్మెల్యే కళావతితో కలిసి ఆయకట్టు రైతుల కలిసి నీటి సమస్య వివరించగా సహృదయంతో స్పందించి నీటి తరలింపు డ్రోణి(ఎస్పీ)నిర్మాణంకు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం వంశధార ప్రాజెక్ట్ అధికారులు నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు మేడిబోయిన చలపతి, బోడాల చిన్నయ్యదొర, రైతులున్నారు.

గిరిజన స్పందనకు 17 వినతులు



వినతులు స్వీకరిస్తున్న ఈఈ సింహాచలం

సీతంపేట: ఐటీడీఏలో సోమవారం జరిగిన గిరిజన స్పందనకు 17 వినతులు వచ్చాయి. ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈ సింహాచలం గిరిజనుల నుంచి వినతులు స్వీకరించారు. భూమి పట్టా మంజూరు చేయాలని బర్న సీతంపేటకు చెందిన కుమార్, కుట్టుమిషన్ ఇప్పించాలని మానాపురానికి చెందిన రేఖ వినతి ఇచ్చారు. రహదారి మరమ్మతులు చేపట్టాలని డెప్పవలస గిరిజనులు కోరారు. టిటుకుపాయిగూడ గ్రామస్తులు కమ్యూనిటీహాల్ నిర్మించాలని కోరారు. రామన్నగూడలో నాటుకోళ్ల ఫారం ఏర్పాటు చేయడానికి రుణం ఇప్పించాలని మల్లేషు, అంగన్‌వాడీ భవనం నిర్మించాలని దిగువనేల బొంతుకు చెందిన కె.భారతి, సీసీ రోడ్డు మంజూరు బెన్నడుగూడ గ్రామస్తులు వినతులు అందజేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



త్రైత సిద్ధాంత భగవద్గీతను ప్రచారం చేస్తున్న ప్రబోధ సమితి సభ్యులు

సీతంపేట: మండలంలోని గడిగుడ్డిలో ప్రభోద సమితి విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. సమితి అధ్యక్షుడు సంతోష్‌కుమార్ గీతా సారాన్ని బోధించారు. ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని, ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని కోరారు. ధనుర్మాసం విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ప్రచారకర్తలు దుర్గారావు, పుండరీకాక్షయ్య, ఈశ్వర్‌లాల్, వెంకటరావు, గోపాలకృష్ణ, ప్రశాంతి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ధనుర్మాస పూజలు

పాలకొండ రూరల్: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని యరకారాయపురం, అంపిలి, మంగళాపురం, తుమరాడ తదితర గ్రామంలోని ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ వర్మ, జోష్యుల ఆంజనేయ వర్మ నేతృత్వంలో స్వామికి అభిషేకాలు, అర్చనలు చేశారు. పలువురు ఆధ్యాత్మిక వక్తలు తిరుప్పావై ప్రవచనాలు, ధనుర్మాస విశిష్టతను భక్తులకు వివరించారు. పలు గ్రామాల్లో భజన బృందాలు వేకువజామున నగర సంకీర్తనలు నిర్వహించారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత



సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: బలిజిపేట మండలం పెద్దపెంకి గ్రామానికి చెందిన పచ్చిపులుసు గౌరీ శంకర్రావు ఇటీవల అనారోగ్యానికి గురై అత్యవసర సమయంలో చికిత్స చేసుకున్నాడు. ఈ కారణంగా రూ.లక్షలు ఖర్చు చేసి అప్పుల భారంతో కుటుంబం నెట్టుకు రావడం కష్టంగా ఉన్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు ముఖ్యమంత్రి సహాయనిధికి సిఫార్సు చేశారు. ఫలితంగా రూ.3.20 లక్షల సహాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంజూరు చేశారు. దీంతో ఎమ్మెల్యే జోగారావు పార్వతీపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో చెక్కును బాధిత కుటుంబసభ్యులకు సోమవారం అందజేశారు. మీ అందరికీ అండగా నిలుస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మీరంతా కూడా అండగా నిలిచి మళ్లీ వచ్చే ఎన్నికలలో ఆయన్ను తప్పక గెలిపించుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో సామాజిక భవనం పనులు



ఫ్లింత్ బీం రాడ్లను పరిశీలిస్తున్న ఏఈ చంద్రమౌళి, ఇంజినీరింగ్ సహాయకులు

సీతానగరం:

నాణ్యతా ప్రమాణాలకు లోబడి పనులు జరిగినప్పుడే భవనాలు సుదీర్ఘకాలం ఉండిపోతాయని మండల సీతానగరం ఇంజినీరింగ్ అధికారి చంద్రమౌళి అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని సుంకరి వీధిలో జరుగుతున్న సామాజిక భవనం పనులను, భవననిర్వాహకులు, ఇంజినీరింగ్ సహాయకులతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సుంకరివీధికి వచ్చిన ఎమ్మెల్యే అలజంగి జోగారావును ప్రజలు సామాజికభవనం మంజూరు చేయాలని కోరడంతో రూ.20 లక్షలు మంజూరుచేసినట్లు తెలియజేశారు. నిర్వాహకులకు నిర్దేశించిన గడువులోగా భవనం నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. అనంతరం పెదభోగిలిలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

ఆరోగ్య శ్రీ పథకం పరిమితి పెంపుపై ప్రచారం చేయాలి



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ

సీతానగరం: ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు పొందడానికి పరిమితిని రూ.25 లక్షలకు పెంచిన విషయాన్ని క్షేత్రస్థాయిలో అందరికీ తెలియజేయాలని వైద్యాధికారులను ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, ప్రజాప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీఓ ఎల్ఎన్ ప్రసాద్, జెడ్పీటీసీఎం బాబ్జీ ఆధ్వర్యంలో సీతానగరం,పెదంకలాం పీహెచ్‌సీ డాక్టర్లు రాధాకాంత్, పావని, వైద్యసిబ్బందితో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని రకాల వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి రూ.25 లక్షలతో ప్రభుత్వం గుర్తించిన ఆరోగ్యశ్రీ ఆస్పత్రుల్లో చికిత్స అందజేస్తారని ప్రజలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్యసేవలలో రకాలను వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు, హెల్త్ సూపర్‌వైజర్లు, వైద్యసిబ్బంది, వివిధ శాఖల అధికార సిబ్బంది పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాకు 2,968 దరఖాస్తులు

గరుగుబిల్లి: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలకు మండలం నుంచి 2,968 మంది క్రీడాకారులు దరఖాస్తు చేసుకున్నారని ఎంపీడీఓ జి.పైడితల్లి సోమవారం తెలిపారు. సచివాలయాల వారీగా వచ్చిన దరఖాస్తులను సోమవారం పరిశీలించారు. గరుగుబిల్లి గ్రామ సచివాలయం నుంచి 204, పెద్దూరు సచివాలయం నుంచి 141, పెదగుడబ నుంచి 174, రావివలస 249, శివ్వాం 205, గొట్టి వలస 174, నాగూరు 289, సంతోషపురం 219, తోటపల్లి 405, ఉల్లిభద్ర 181, ఉద్దవోలు 396, రావుపల్లి 177, చినగుడబ సచివాలయం నుంచి 181 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈమేరకు క్రీడాకారులకు సామాగ్రి అందించడంతో పాటు క్రీడా మైదానాలను సిద్ధం చేయాలని వ్యాయామోపాధ్యాయులకు సూచించినట్లు చెప్పారు.

వాహన తనిఖీలు

పాలకొండ రూరల్: పాలకొండ-శ్రీకాకుళం రహదారిలో ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. వాహన ధ్రువపత్రాలను పరిశీలించారు. అధికలోడు వస్తున్న వాహనాలు, మద్యం తాగి వాహనం నడుపుతున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణ, నిషేధిత పదార్థాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వాహన చోదకులు రోడ్డుభద్రత నిబంధనలు పాటించడం ద్వారా పోలీసులకు సహకరించాలని కోరారు.

సౌండ్ సిస్టం వితరణ

పాలకొండ: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీ ప్రభుత్వ పాఠశాలకు అదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయిని జె.జయమణి రూ.20 వేలు విలువచేసే సౌండ్ సిస్టం సోమవారం వితరణ చేశారు. పాఠశాల అభివృద్ధికి జయమణి చేసిన సేవా కార్యక్రమాలను హెచ్‌ఎం రామలక్ష్మి కొనియాడారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని ఉపాధ్యాయులు పాఠశాలల అభివృద్ధికి ముందుకు రావాలని కోరారు.

ఆర్డీఓ కార్యాలయం

ముట్టడి

పాలకొండ: అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె కొనసాగుతోంది. సోమవారం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం ముట్టడించారు. ప్రధాన రహదారిపై బైఠాయించి తమ డిమాండ్లు తీర్చాలని నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీఓ లావణ్యకు వినతిపత్రం అందించారు.